
పూజల్లో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి

హనుమాన్ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు

చంపాపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్‌లో ప్రసిద్ధిగాంచిన హనుమాన్ ఆలయాన్ని మంత్రి వాకిటి శ్రీహరి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి ఈవో లావణ్య, వేద పండితులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు మంత్రి వాకిటి శ్రీహరికి వేద ఆశీర్వచనం అందించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాస్, పృథ్వీచౌదరి


శ్రీనివాస్‌గుప్తా


పృథ్వీచౌదరి

మన్సూరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, పృథ్వీ చౌదరి నియమితులయ్యారు. ఈ మేరకు ఆలిండియా కాంగ్రెస్ కమిటీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించిన పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్రనాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్, మీనాక్షినటరాజ్, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

హిందూ శ్మశానవాటికను మోడల్‌గా తీర్చిదిద్దుతా

- జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ నర్సింహారెడ్డి


కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ జడ్జెస్ కాలనీ ఫేజ్-1లోని హిందూ శ్మశానవాటికను మోడల్‌గా తీర్చిదిద్దుతానని స్థానిక కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. రూ.54.40లక్షల వ్యయంతో శ్మశానవాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ శ్మశానవాటికలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సీసీ రోడ్లు, గార్డెన్, పేయింటింగ్ వేయించడంతో పాటు నీటి సదుపాయాన్ని కూడా కల్పించామన్నారు. పరిసర ప్రాంత ప్రజలు కమిటీ వేసుకుని వాచ్‌మెన్‌ను నియమించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా కాలనీ అసోసియేషన్ల సభ్యులు సయ్యద్ జానీమియా, దామోదర్‌గౌడ్, మోహన్‌రెడ్డి, భిక్షపతి, శ్రీశైలం యాదవ్, రాములు, బద్రీనాథ్, షణ్ముఖచారి, వెంకటేశ్వర్‌రెడ్డి, యాదయ్య, వెంకటేశం, సుకుమార్, శివ, అనిల్, పార్టీ నేతలు ఆదినారాయణ, సంతోష్‌కుమార్, రాఘవేందర్, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- మీర్‌పేట్ కమిషనర్ జ్ఞానేశ్వర్


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జ్ఞానేశ్వర్

సరూర్‌నగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కార్మికులు విధి నిర్వహణతో పాటు ఆరోగ్యంపైననూ శ్రద్ధ వహించాలని మీర్‌పేట్ కార్పొరేషన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ సూచించారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మంగళవారం మీర్‌పేట్ 29 డివిజన్‌లోని యూపీహెచ్‌సీలో సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశమున్నందున ముందు జాగ్రతగా సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకోవాలని కమిషనర్ సూచించారు. అంతకు ముందు 25వ డివిజన్‌లోని ఎన్‌బీఆర్ కాలనీలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ వెంకన్న, ఆర్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ రమేశ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సమావేశం

ఎల్‌బీనగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలో బ్లాక్-2 కాంగ్రెస్ సమావేశాన్ని బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు సరూర్‌నగర్‌లోని అశోక ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా పరిశీలకులు శివసేనారెడ్డి, దారాసింగ్, ఇతర నేతలు పాల్గొంటారని ఆయన అన్నారు. సమావేశానికి కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంస్థల నాయకులు హాజరుకావాలని కోరారు.

పకడ్బందీగా పారిశుధ్య డ్రైవ్

ఉప్పల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బోడుప్పల్ కార్పొరేషన్‌లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను పకడ్బందీగా చేపడుతున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ శైలజ పేర్కొన్నారు. మంగళవారం 13, 27, 28వ డివిజన్లలో చేపట్టిన పారిశుధ్య డ్రైవ్‌ను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో బోడుప్పల్‌కు చెందిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ మేయర్ అజయ్‌యాదవ్, బోడుప్పల్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, నాయకులు రాపోలు రాములు, చీరాల నర్సింహ, కొత్త చందర్‌గౌడ్, పద్మారెడ్డి, సుమన్‌నాయక్, బొమ్మక్ మురళి, పులకండ్ల జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు: వజ్రేష్ యాదవ్


ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేస్తున్న నగర కమిషనర్ శైలజ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్

ఉప్పల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబాల్లో అర్హులైన వారికి పక్కా ఇళ్లు నిర్మించడమే కాంగ్రెస్ సర్కారు లక్ష్యమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్లకు కమిషనర్ శైలజతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. స్థలం ఉండి ఇళ్లు కట్టుకునేందుకు రూ.5లక్షల ఆర్థిక సాయం అందజేస్తోందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. 13, 27, 28వ డివిజన్ల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నగర మాజీ మేయర్ అజయ్ యాదవ్, పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాములు పాల్గొన్నారు.

నీటి గోస తీరేదెన్నడో..!

- ఇబ్బందులు పడుతున్న సింగరేణి గుడిసెవాసులు
- కోర్టు తీర్పు సాకుతో నీటి పైప్‌లైన్లు వేయని అధికారులు
- ఉచిత ట్యాంకర్లే దిక్కు
- జలమండలి ఆదాయానికి గండి


వైశాలీనగర్ రిజర్వాయర్ ఎదుట గుడిసెవాసుల ధర్నా(ఫైల్)

సైదాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్‌లోని సింగరేణి కాలనీ గుడిసెలలో కోర్టు తీర్పు సాకుతో మంచినీటి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో జలమండలి ఉచిత ట్యాంకర్లే వారికి దిక్కుగా మారాయి. రెండు రోజులకోకసారి వచ్చే అరకొర ట్యాంకర్లతో గుడిసెవాసులు మంచినీటి కోసం అల్లాడుతున్నారు. ఈ గుడిసెలలో సుమారు 13 వేల కుటుంబాలు 28 ఏళ్లుగా నివసిస్తున్నాయి. అందులో నివసించేది అత్యధిక శాతం గిరిజన కుటుంబాలే. గత ప్రభుత్వం మురికివాడలు, బస్తీలలో రూ.1కే నల్లా పథకం ప్రవేశపెట్టి గ్రేటర్‌లోని అన్ని ప్రాంతాలలో కనెక్షన్లు ఇచ్చి ఉచిత నీటి సరఫరా చేసింది. గుడిసెలలో విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు వేసిన అధికారులు నల్లా కనెక్షన్ల విషయంలోనే కోర్టు తీర్పు సాకు చూపించడం వల్ల గుడిసె వాసులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జలమండలి అధికారుల ద్వంద్వ వైఖరి..

సింగరేణి గుడిసెవాసులకు డ్రైనేజీ పైపులైన్లు వేసిన జలమండలి అధికారులు మంచినీటి కనెక్షన్ల విషయంలో కోర్టు తీర్పును సాకుగా చూపడం పలు అనుమానాలకు తావిస్తోంది. కేవలం రూ.20 లక్షల వ్యయంతో ఆ ప్రాంతంలో నీటి కనెక్షన్లు ఇస్తే మంచి నీటి సమస్య తీరుతుంది. నీటి కనెక్షన్ ఇవ్వకుండా నిత్యం వైశాలీనగర్ రిజర్వాయర్ నుంచి 100-120 ట్యాంకర్ల మంచినీటిని ఉచితంగా సరఫరా చేస్తున్నారు. దీని ద్వారా నెలకు సుమారు రూ.10 నుంచి 12 లక్షలు ట్యాంకర్ యాజమానులకు చెల్లిస్తున్నారు. ఇలా కాకుండా నీటి కనెక్షన్ ఇస్తే జలమండలికి భారీగా ఆదాయం మిగులుతుంది. అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి సింగరేణి గుడిసెల్లో నివసించే వారికి నల్లా కనెక్షన్ ఇవ్వాలని వారు కోరుతున్నారు.


ట్యాంకర్ల వద్ద నీటిని పట్టుకుంటున్న గుడిసెవాసులు

గుడిసెవాసులపై వివక్ష వద్దు



డివిజన్‌లోని వివాదంలో ఉన్న ఇతర మురికివాడలకు మంచినీటి, విద్యుత్, డ్రైనేజీ కనెక్షన్లు ఇచ్చారు. కానీ సింగరేణి గుడిసెలలోని వారికి డ్రైనేజీ, విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి కోర్టు తీర్పు సాకుతో కేవలం మంచినీటి కనెక్షన్లు ఇవ్వకపోవడం దారుణం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మంచినీటి కనెక్షన్లు మంజూరు చేయాలి.

- మోతీలాల్‌నాయక్, అధ్యక్షుడు, సేవాలాల్ బంజారా సంఘం

కోర్టు తీర్పును వక్రీకరిస్తున్నారు



సింగరేణి గుడిసెల ప్రాంతంలో పేద ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కానీ అధికారులు ఎందుకు నీటి కనెక్షన్ ఇవ్వడం లేదో అర్థం కావడం లే దు. అధికారుల తీరుతో పేదలు మంచినీటి కోసం తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. జలమండలి అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి.

- మహమూద్, సీపీఐ కార్యదర్శి, ఐఎస్‌సదన్ డివిజన్

సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


సమస్యలను అధికారికి వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రజలకు హామీనిచ్చారు. హయత్‌నగర్ డివిజన్ శారదానగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యుల విజ్ఞప్తి మేరకు మంగళవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కాలనీలో పర్యటించారు. కాలనీ సంక్షేమ సంఘం భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సుమారు రూ.80 లక్షల వ్యయంతో సంక్షేమ సంఘం భవన అదనపు అంతస్తును నిర్మిస్తామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న మూత్రశాలలు, ఫ్లోరింగ్, పెయింటింగ్ పనులు పూర్తి చేయిస్తానని హామీనిచ్చారు. కాలనీలో కుక్కల బెడదను నివారించాలని ఎమ్మెల్యేకు సూచించగా తక్షణమే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలనీలో వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్ రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగాని శ్రీధర్‌గౌడ్, భాస్కర్, సాగర్, శ్రవణ్‌కుమార్, గుత్తా లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి: వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

సంతోష్‌నగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. ప్రధానిగా మోదీ 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ఉప్పర్‌గూడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో వికసిత్ భారత్ కా అమృత్‌కాల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నరేంద్రమోదీపై ఏ ఒక్క అవినీతి ఆరోపణ లేదని, ఇది దేశ ప్రజల నమ్మకానికి నిదర్శనమని కొనియాడారు. ప్రపంచ దేశాలన్ని భారత్ వైపు చూస్తున్నాయన్నారు. 2047 వరకు భారత్ ను వికసిత్ భారత్ గా తీర్చిదిద్దడమే మోడీ సర్కార్ లక్ష్యం అని పేర్కొన్నారు. మహిళలు, రైతులు, యువత అభివృద్ధే లక్ష్యంగా ప్రధాని ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌తో దేశ రక్షణ రంగ వ్యవస్థను శత్రు దేశాలకు తెలిసేలా మోదీ చేశారని ఆయన అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, రాష్ట్ర సెక్రటరీ ప్రకాశ్‌రెడ్డి, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్‌జీ, మహేశ్వర్, శ్రీకాంత్‌రెడ్డి, మహేశ్, నవీన్‌కుమార్, ఈశ్వర్‌యాదవ్, పెద్దియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలు అన్ని రంగాల్లో రాణించాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్
- బడంగ్‌పేట్‌లో మహేశ్వరం కార్యకర్తల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్‌మాదిగ

సరూర్‌నగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ద్వారా సంక్రమించిన 9శాతం రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకుని మాదిగలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాదిగ ఆకాంక్షించారు. రిజర్వేషన్లు అనే నాణానికి ఓ వైపు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అయితే మరోవైపు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ నిలుస్తారని ఆయన కొనియాడారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మహేశ్వరం నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం బడంగ్‌పేట్‌లోని ప్రజాభవన్‌లో ఎంఎస్‌పీ జిల్లా నాయకుడు రవిమాదిగ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు ఆమోదించడం మంద కృష్ణ సాధించిన విజయమని ఆయన అన్నారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబు, ఆయా సంఘాల ప్రతినిధులు బక్కని రవి, కృష్ణ, గణేశ్, నవీన్, జంగయ్య, పాండు, శ్రీశైలం, అమ్రేష్, సుధాకర్, నర్సింహ, వెంకటేశ్, ఆనంద్, దానయ్య, శివకుమార్, రామారావు, కృష్ణయ్య, జనార్ధన్, చిట్టు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి: రాజశేఖర్‌రెడ్డి


లక్ష్మీనారాయణకాలనీలోని సమస్యలను తెలుసుకుంటున్న జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్‌లోని లక్ష్మీనారాయణ కాలనీలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని చెప్పారు. రోడ్డు, డ్రైనేజీ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని ఆయన ప్రజలకు హామీనిచ్చారు. అనంతరం లింగోజిగూడ డివిజన్ ప్రగతినగర్‌కాలనీలో పర్యటించారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. రోడ్లపై చెత్త వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ నాయకుడు మనోజ్, కాలనీ ప్రతినిధులు లలిత్‌పటేల్, దేశిపటేల్, ప్రేమ్‌జీపటేల్, క్రాంతిపటేల్, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, మనోజ్, రోహిత్, కాలనీ ప్రతినిధులు మోహన్‌రెడ్డి, నరసింహరావు, సదానంద్, శానిటేషన్ సూపర్‌వైజర్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.98 కోట్లతో రిటర్నింగ్ వాల్


శేషసాయినగర్‌లో నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రజిత

ఉప్పల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): యేటా వర్షాకాలంలో సంభవించే ముంపు ప్రమాదాన్ని నివారించేందుకు ఉప్పల్ శేషసాయినగర్, మల్లికార్జుననగర్‌లో రూ.1.98 కోట్లతో చేపడుతున్న రిటర్నింగ్ ఎంతో దోహదపడుతుందని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితా పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డితో కలిసి ఆమె నాలాను సందర్శించారు. నాలా రిటర్నింగ్ వాల్ పనులను త్వరితగతిన చేపట్టాలని అధికారులను కోరారు. శేషసాయినగర్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ హరిలాల్, డీఈ వేనల్‌కుమార్, నర్సయ్య, సత్తిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

నేడు దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

మన్సూరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ శ్రీసాయినగర్ కాలనీలోని దుర్గాదేవి ఆలయ 20వ వార్షికోత్సవాలను బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేశ్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి రోజు అమ్మవారి అష్టోత్తర శత కలశాభిషేకం, రెండో రోజు చతుషష్ఠి ఉపచారపూజ, మూడో రోజు సామూహిక కుంకుమార్చన, అన్నదానం, అమ్మవారి శేషవస్త్రాల వేలంపాట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని గణేశ్‌యాదవ్ కోరారు.

డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

- చంపాపేట కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి


సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని కాలనీలు, బస్తీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి ప్రజలకు హామీనిచ్చారు. డివిజన్‌లోని క్రాంతినగర్‌కాలనీ, బైరామల్‌గూడ ఓల్డ్ విలేజ్‌లో రూ.1.20కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర్ పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ అధికారులను కోరారు. కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా లేవల్‌గా సీసీ రహదారి నిర్మాణ పనులను చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆయన సూచించారు. జీహెచ్‌ఎంసీ ఏఈ సురేశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, క్రాంతినగర్ కాలనీ అధ్యక్షుడు ఆనంద్, కాలనీప్రతినిధులు నరేందర్‌రెడ్డి, దివాకర్, సత్యనారాయణ, రామకృష్ణ, విజయభాస్కర్‌రెడ్డి, శ్యామ్, నాయకులు శ్రవణ్‌కుమార్, వేణుగోపాల్, వేణుగౌడ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్‌లోని నిర్వహణ పనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డీఈ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ సాయి కాలనీ, గ్రీన్‌హిల్స్, టీఎస్ హౌసింగ్‌బోర్డ్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో ఉదయం 10 నుంచి 1 గంటల వరకు, 11కేవీ బీరప్ప టెంపుల్, అష్టలక్ష్మి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 11కేవీ ఎల్‌బీ నగర్, సిరీస్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ తెలిపారు.

అబ్దుల్లాపూర్‌మెట్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

అబ్దుల్లాపూర్‌మెట్: చెట్ల కొమ్మల నరికివేత కారణంగా అబ్దుల్లాపూర్‌మెట్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నరేందర్ మంగళవారం తెలిపారు. 11కేవీ తారామతిపేట, జేఎస్ గుప్త ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తారామతిపేట గ్రామంతో పాటు చిన్న పరిశ్రమలు, జేస్ గుప్త ఇండస్ట్రియల్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

- 7 సెల్‌ఫోన్లు, రూ.20వేల నగదు స్వాధీనం

చంపాపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 8 మందిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హాఫీజ్‌బాబానగర్ సీ బ్లాక్‌లోని ఓ ఇంట్లో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. అప్రమత్తమైన సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట ఆడుతున్న ఇంటికి వెళ్లి 8మందిని పట్టుకున్నారు. వారి నుంచి 7 సెల్‌ఫోన్స్, రూ.20వేల నగదును స్వాధీనం చేసుకుని కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. 8 మందిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపారు.

నిమిషాంబదేవి అమ్మవారికి అభిషేకం


అమ్మవారికి అభిషేకం చేస్తున్న జగద్గురు శంకరాచార్యులు

ఉప్పల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బోడుప్పల్ శ్రీమాతా నిమిషాంబ దేవికి 56 రకాల పండ్ల రసాలతో మంగళవారం జగద్గురు శంకరాచార్యులు అభిషేకం చేశారు. ఆలయ 19వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలలో భాగంగా విశేష అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. బీజేపీ రాష్ట్ర నాయకురాలు మాధవిలత, మున్సిపల్ కమిషనర్ శైలజ, డీఈ చిరంజీవి, ఆలయ కమిటీ చైర్మన్ వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.